రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా మామిడి కృష్ణ



గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా చాంద్రాయణగుట్టకు చెందిన మామిడి కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు గురు వారం నియమాక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాణి అవంతీబాయికి ఘన నివాళి



వర్ధంతిలో ఎమ్మెల్యే రాజాసింగ్, ఆల పురుషోత్తమ్‌రావు

అబిడ్స్: స్వాతంత్య్ర సమరయోధురాలు రాణి అవంతీబాయి వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, ఇతర నాయకులు జుమ్మెరాత్‌బజార్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జియోగ్రాఫికల్ సర్వేకు ప్రజలు సహకరించాలి



దుబ్బాక లావణ్య

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గంలో చేపడుతున్న జియోగ్రాఫిక్ సర్వేకు ప్రజలు సహకరించాలని అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య కోరారు. తన కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. సర్వేయర్లు ఇళ్లవద్దకే వచ్చి సర్వే చేస్తారన్నారు. కొంతమంది అవగాహన లేకే సర్వేయర్లను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా ప్రత్యేకంగా ఓ ఏజెన్సీ ద్వారా సిబ్బందిని ఎంపిక చేశామని తెలిపారు. గ్రేటర్‌లో డిజిటల్ డోర్‌నెంబర్ వ్యవస్థను తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. జీపీఎస్ ట్రాక్, సిటిజన్ సర్వీసు వంటి మెరుగైన సౌకర్యాలు ప్రజలకు అందిస్తామన్నారు. సర్వేయర్లకు, ఇతర సిబ్బందికి ప్రజలు తమ ఇండ్ల వివరాలు అందించాలని విన్నవించారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన నేతలు

మణికొండ: బీఆర్‌ఎస్ పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయటంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను నిలదీసేందుకు జిల్లాల పర్యటన చేపట్టిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మణికొండ మున్సిపాలిటీ నాయకులు స్వాగతం పలికారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి సూర్యాపేట జిల్లాకు వెళ్తుండటంతో పుప్పాలగూడ ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆయన కాన్వాయ్‌కి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో పాటు సూర్యాపేట బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి. సీతారాం, నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, రూపారెడ్డి, ఎ.లక్ష్మణ్ రావు, మాల్యాద్రినాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కీర్తిలతాగౌడ్, రాజేంద్రప్రసాద్, జి.విఠల్, సుమనళిని, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మేకలమండి కళకళ.!

- రంజాన్ మాసం నేపథ్యంలో పెరిగిన విక్రయాలు
- ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున గొర్రెలు,మేకల దిగుమతి



జియాగూడ: రంజాన్ మాసం నేపథ్యంలో జియాగూడ మేకలమండి కళకళలాడుతోంది. సాధారణ రోజుల కంటే మాసం విక్రయాలు పెరగడంతో మటన్ ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. విక్రయాలకు తగ్గట్టు పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో గొర్రెలు, మేకలు దిగుమతి అవుతున్నాయి. ప్రతిరోజు సుమారు 15 వేలకు పైగా జీవాల విక్రయాలు, కటింగ్ జరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.850 లభించే మాంసం , ప్రస్తుతం రూ.1000కు పైగానే పలుకుతోంది.

ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలు, మేకల దిగుమతి..

జియాగూడ మేకల మండికి ప్రతిరోజు తెలంగాణ, రాజస్థాన్, మహారాష్ట్ర, పాకిస్తాన్ బోర్డర్ కచ్ నుంచి జీవాలు వస్తున్నాయి. 10 కేజీల గొర్రెలు, మేకల నుంచి 30, 45 కేజీల వరకు అందుబాటులో పెడుతున్నారు. అలాగే మొయినాబాద్, కడ్తల్ ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌ల్లో కూడా గొర్రెలు, మేకలను పెంచుతున్నారు. వీటిని కూడా రంజాన్ మాసంలోనే విక్రయిస్తారు. ఈ గొర్రెలు, మేకలు ఎక్కువ బరువుగలవి ఉంటాయి. అయితే వీటి ధర లు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.

జియాగూడ నుంచే అధికం..

రంజాన్ మాసంలో హలీం తయారీకి నగరంలోనే కాకా తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు సైతం జియాగూడ మేకలమండి నుంచే గొర్రెలు, మేకలను కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ప్రతిరోజు సుమారు 5 వేలకు పైగా హోటల్స్‌కు హలీం తయారీకి తరలిస్తారు. మంగళ, శుక్రవారాల్లో జియాగూడ నుంచి చెన్నైకి వేలాది గొర్రెలు మేకలు తరలిస్తుంటారు.

'నామ్‌కే వాస్తేగా అసెంబ్లీ సమావేశాలు'

నాంపల్లి: అసెంబ్లీ సమావేశాలు నామ్‌కే వాస్తేగా నిర్వహిస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్ బాబు ఆరోపించారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ మీద రౌండ్ టేబుల్ సమావేశం గురువారం రాత్రి జరిగింది. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదిలో 100 రోజులు తక్కువ కాకుండా అసెంబ్లీ సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహిస్తోందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కూడా ఒక నియంతలాగా పరిపాలించారని, అదే విధానమే కాంగ్రెస్ పార్టీ కూడా అవలంబిస్తోందని విమర్శించారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లేక మీడియా పాయింట్ వద్ద చెప్పుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. బడ్జెట్‌లో కాకి లెక్కలు కాకుండా పారదర్శకతకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ప్రజా సంక్షేమం పరిడవిల్లుతుందన్నారు.

ఆకట్టుకున్న కాకతీయ స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

జియాగూడ: విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమని ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠ మండల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మదన్ జాదవ్, కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ అన్నారు. జియాగూడలోని ఎస్‌ఆర్ బ్యాంక్విట్ హాల్‌లో కాకతీయ స్కూల్ వార్షికోత్సవం, ప్రీప్రైమరీ నుంచి ప్రైమరీకి వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాల పంపిణీ, అలాగే ఫేర్‌వెల్ కార్యక్రమాలను స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ వి.వికాస్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా మొబైల్‌కు బానిసవుతున్న చిన్నారులపై నాటకం, కరాటే, యోగా వంటిపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర 100 శాతం అటెండెన్స్, బెస్ట్ డిసిప్లీన్, అకాడమీ టాపర్స్, సైన్స్‌ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న 150 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ రాజేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రస్న, ఇన్‌చార్జిలు సుమెద, వందన, స్నేహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న విక్రమ్‌యాదవ్ తదితరులు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్ అన్నారు. బీసీ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను నాయకులతో కలిసి గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ యువతకు వినూత్న పథకాలు ప్రవేశపెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా రాజీవ్ వికాసం అన్నారు. ఈ పథకం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, జంగ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీకి అగ్గిపెట్టె గుర్తు కేటాయింపు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం అగ్గిపెట్టె గుర్తును కేటాయించినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. బషీర్‌బాగ్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేస్తున్న మనువాద దోపిడీ పార్టీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి పోటీల పోస్టర్ విడుదల

చార్మినార్ : 'వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్–2025'లో భాగంగా ఈనెల 21, 22న సిటీ కాలేజీలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. గురువారం పోస్టర్ విడుదల చేశారు. హైదరాబాద్ నోడల్ కేంద్రంలో యువత పంపిన వీడియోలను స్క్రూటినీ చేసి 150 మంది ప్రతిభావంతులైన యువతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ సంచాలకుడు ఆచార్య రాజేందర్ సింగ్ అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన 10 మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి డా. డి. నాగరాజు సమన్వయ కర్తగా వ్యవహరిన్నారన్నారు. యువతలోని నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడంతో పాటు వారి సృజనాత్మకతను వెలికితీసే వేదికగా ఇది నిలుస్తుందని ఆయన తెలిపారు.

24 నుంచి టీడీసీఏ, ఏవైసీఏ క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ జెర్సీ, లోగోలు ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్

గన్‌ఫౌండ్రీ: ఈనెల 24 నుంచి అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం అండర్–17 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నది. 50 ఓవర్ల ఫార్మట్‌లో జరగనున్న పోటీల జర్సీలను తెలంగాణ డీజీపీ జితేందర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ టోర్నమెంట్ ఓ మంచి వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు కె.అరుణ్, స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మన్ రామిరెడ్డి, టీడీసీఏ కన్వీనర్లు ఉస్మాన్ అలీ, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు రండి




ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: ఈ నెలలో తాను ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని కోరుతూ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌ను గురువారం కలిసి ఆయనకు ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, మౌలానా కారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ ఉన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో బల్దియా ఈఈ వెంకటశేషయ్యతో గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. అదేవిధంగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ రామకృష్ణా, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

విద్యుత్ వెలుగుల్లో గోల్కొండ కోట



గోల్కొండ: గోల్కొండ కోట ఎరుపు రంగులో కొత్త శోభను సంతరించుకుంది. టీబీ నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చారిత్రక కట్టడాలను ప్రతినెల 24న ఎరుపు రంగు విద్యుత్ దీపాలతో అలంకరిస్తుంది. 'నీ-క్షయ' కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా గోల్కొండ కోటను ఎరుపు రంగు విద్యుత్ దీపాలతో గురువారం అలంకరించామని గోల్కొండ కోట పర్యవేక్షణ అధికారి మల్లేశం తెలిపారు.

మూసీనదిలో ఒకరి గల్లంతు

జియాగూడ: మూసీనదిలో వ్యక్తి పడి గల్లంతైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 100 ఫీట్ల జాతీయ రహదారి పక్కన గల పీలి మండప్ ప్రాంతంలో కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన సుమారు 45 ఏళ్ల పైబడిన వ్యక్తి మద్యం తాగు అదుపుతప్పి మూసీనదిలో పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పీలీమండప్ ప్రాంతంలో గల మూసీ నదిలో మృతదేహం కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు



షేక్ ఫరీద్ అహ్మద్

సంతోష్‌నగర్: హత్యాయత్నం కేసు నిందితుడికి నాంపల్లి కోర్టు జడ్జి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,500ల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఫరీద్ అహ్మద్ (38) స్థానికంగా మొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. 2018 జూన్ 6న సయ్యద్ అక్రమ్ సోదరి మీన్హాజ్ ఫాతిమాను ప్రేమ పేరిట షేక్ ఫరీద్ వేధింపులకు గురిచేశాడు. ఈ విషయమై మీన్హాజ్ ఫాతిమా మరో సోదరుడు సయ్యద్ అస్లాం మందలించాడు. దీంతో అతనిపై కోపం పెంచుకున్న షేక్ ఫరీద్ తల్వార్‌తో సయ్యద్ అస్లాంపై పలు చోట్ల దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి 2018 జూన్ 7న రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న షేక్ ఫరీద్ అహ్మద్‌ను గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా 7 జైలు శిక్షతో పాటు రూ.2,500ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక'తో ఎన్నో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న దేవర వంశీ

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. గుడిమల్కాపూర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌తో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'ను కొన్ని రాజకీయ పార్టీల వారు అర్థరహితంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎంతో ముందు చూపుతో రూపొందించిన ఇది పారదర్శకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవర రాజేశ్వర్, వేణుగోపాల్, రమేశ్, విశ్వనాథ్, యాదయ్య, దేవర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంపై హర్షం



పాలాభిషేకం కార్యక్రమంలో నాయకులు

గౌలిపురా: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముజీబుల్లా షరీఫ్, యాకుత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రవి రాజ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గౌలిపురా చౌరస్తా వద్ద సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహేశ్ కుమార్ గౌడ్‌తో ఉన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ ప్రవేశపెట్టడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్ల భాస్కర్, కృష్ణకుమార్, రాజుయాదవ్, మామిడాల శ్రీనివాస్, అల్లం రాకేశ్, డల్లు శివ, చందు, శశి యాదవ్, ఫెరోజ్, సురేశ్ గౌడ్, ఫిరోజ్, అబ్దుల్ జానీ, కృష్ణ, మల్లికార్జున్, పవన్ యాదవ్, లడ్డూ పటేల్, కార్తీక్, దినేశ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పార్కులో సౌకర్యాల కల్పనకు కృషి



అధ్యక్షుడు శ్రీధర్‌సాగర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కుల్సుంపురా పార్కులో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని కుల్సుంపురా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీధర్‌సాగర్ అన్నారు. పార్కులో పార్కు కమిటీ ప్రతినిధులు, స్థానికులు గురువారం ఉదయం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కుకి అన్ని వయస్సుల వారు వస్తుంటారని, స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, యాదవ్, పార్కు, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వోన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ హంగామా



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి బండ్లగూడ రేంజ్ వన్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ లక్ష్మణ్ సింగ్ అధ్యక్షతన వహించారు. బండ్లగూడ రేంజ్ టు డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కె.దశరథ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.నారాయణ, గణిత ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, పీఈటీలు వి.శ్రీను నాయక్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

చార్మినార్: అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రామ్ గోపాల్ రెడ్డి గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జాతీయ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ చంద్రముఖర్జీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి జాతీయ సలహాదారులు, గ్రీన్ అంబాసిడర్ ఆఫ్ తెలంగాణ స్టేట్ లయన్ డాక్టరు.కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, ఫిలంతర్పిస్ట్ అమెరికా దేశ సిటిజన్ టీ .రామచంద్రారెడ్డి, నగర ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఊహ మూల్పూరు లు గౌరవ అతిథులుగా రానున్నట్లు పేర్కొన్నారు. ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వన్, టూ, త్రీ ,అండ్ ఫోర్ వలంటీర్లు ప్లకార్డులుతో ర్యాలీ నిర్వహించి అడవుల పరిరక్షణకై ప్రజలను జాగృతి పరుస్తారని తెలిపారు.

గోల్కొండ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇఫ్తార్ విందు



చాట్‌ను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

గోల్కొండ: గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీలక్ష్మి గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరబిక్, ఉర్దూ విద్యార్థినులు రంజాన్ ప్రాముఖ్యతను వివరించే వివిధ రకాల చాట్‌లు, కటౌట్లు తయారు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపవాస దీక్ష వలన కలిగే శాస్త్రీయ ప్రయోజనాలను ప్రిన్సిపాల్‌కు వివరించారు. 5 పూటల నమాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను కటౌట్లపై అందంగా రాసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుమేరాసైద్ అకాడమీక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఎస్.రజనీష్, అరబిక్ విభాగం అధిపతి డాక్టర్ మన్జూర్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బ్రయిటన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో..



ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: రెయిన్ బజార్‌లోని బ్రయిటన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పేద ప్రజలకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. రెయిన్ బజార్, తలాబ్ చంచలం, సంతోష్ నగర్ కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనా బేగం, ముజఫర్ హుస్సేన్, పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.